# సాక్షి సూర్యాపేట

గురువారం । 14 । మార్చి । 2024




**తహసీల్దార్లకు అధికారం ఇస్తేనే..**
భూ సమస్యలు పరిష్కారం కావాలంటే తహసీల్దార్లకు అధికారాలివ్వాలని ధరణి అధ్యయన కమిటీ పేర్కొంది. - 8లో




## న్యూస్‌రీల్

### మద్యం మత్తులో ప్రమాదానికి కారణమైతే 10 ఏళ్ల జైలు


సూర్యాపేట క్రైం: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి కారకులైతే గరిష్టంగా 10ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని ఎస్పీ రాహుల్‌హెగ్డే ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు వాహనదారులు, ప్రజల అజాగ్రత్త వల్లనే నమోదవుతున్నాయని, వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో అన్ని రహదారులపై 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు 687 రోడ్డు ప్రమాదాలు సంభవించగా ఇందులో 302 మంది మృత్యువాత పడ్డారని 646 మంది క్షతగాత్రులయ్యారని వివరించారు. ఈ గణాంకాలు కలవరపెడుతున్నాయని పేర్కొన్నారు.

### సూర్యాపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి


భట్టికి వినతి పత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని, సూర్యాపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ పలు సమస్యలు వివరించారు. మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని భట్టి హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బానోత్ వినోద్‌కుమార్, వినయ్, విష్ణు, తన్వేష్ పాల్గొన్నారు.

### రాజీమార్గమే రాజమార్గం


మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట) : కేసుల విషయంలో రాజీ మార్గమే రాజమార్గం అని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్‌లోని కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో ఇరువర్గాల కక్షిదారులు రాజీ పడి పరిష్కరించుకోవచ్చన్నారు. దీని వల్ల సమయం, ధనం, వృథా కాకుండా ఉంటుందన్నారు. సివిల్, క్రిమినల్, వెహికిల్, ఎక్సైజ్, విద్యుత్, బ్యాంకు, గృహహింస వంటి కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఒక్కసారి లోక్ అదాలత్‌లో రాజీ పడిన కేసులను అపీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. చిన్న చిన్న ఘర్షణలకు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కకుండా గ్రామంలోనే పెద్దల సమక్షంలో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

### రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో పశు వైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో సిబ్బందిని టీములుగా విభజించి ప్రణాళిక ప్రకారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వెంకన్న, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ● ముగిసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు



సూర్యాపేటటౌన్ : ఇంటర్ ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థుల పరీక్షలు ముగిశాయి. బుధవారం జనరల్ విభాగంలో 7,122 మంది విద్యార్థులకు 6765 మంది హాజరు కాగా 357 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,505 మందికి 1,309 మంది హాజరు కాగా 196 మంది గైర్హాజరయ్యారు. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి.

## ● శేష వాహనంపై నృసింహుడి విహారం




యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శేషవాహనంపై విహరిస్తున్న స్వామివారు, మత్స్య అలంకృతుడైన నృసింహుడు

# సాగునీటి రంగానికి ప్రాధాన్యం


రెడ్లకుంట ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ వెంకటరావు

- మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన


మాట్లాడుతున్న భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తదితరులు

కోదాడ: కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం కోదాడ మండలం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై రూ. 47.50 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంతో పాటు రూ.5.50 కోట్లతో ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనులకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని పేర్కొన్నారు.

**అర్హులందరికీ త్వరలో తెల్లరేషన్ కార్డులు**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు ఇస్తామని, రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీని వంద రోజులు పూర్తి కాకముందే అమలు చేస్తూ తమది ప్రజాపాలన అని నిరూపించామని అన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగమైన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు.మహిళలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఇది పేదలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు కలిగి 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించుకున్న వారందరుమార్చి 1వ తేదీ నుంచి కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదనిసూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలవ బోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### ప్రాజెక్టుల పేరుతో దోపిడీ

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందన్నారు. రైతులకు వచ్చే వానకాలం సాగునీటిని అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచుతానని తెలిపారు. రెడ్లకుంట, శాంతినగర్ ఉత్తమ్ పద్మావతి ఎత్తి పోతల పథకాల వల్ల 10 వేల ఎకరాలకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటరావు, కోదాడ ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ కృష్ణకుమారి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, ఓరుగంటి శ్రీనివాస రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, పందిరి నాగిరెడ్డి, ఈదుల కష్ణయ్య, మాజీ సర్పంచ్ సాధినేని లీలా అప్పారావు, కనగాల నాగేశ్వరరావు, కునుకుంట్ల శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థిగా సైదిరెడ్డి

- నల్లగొండ నుంచి బరిలో నిలిపిన కమలం పార్టీ
- ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డికే ఎంపీ టికెట్
- ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికే..
- భువనగిరి నుంచి ఇప్పటికే బూర నర్సయ్య ఖరారు
- మోదీ ప్రభంజనంలో గెలిపించుకునే ఎత్తుగడలో బీజేపీ



పేరు: శానంపూడి సైదిరెడ్డి
స్వగ్రామం: గుండ్లపల్లి, మఠంపల్లి మండలం, సూర్యాపేట జిల్లా
తల్లిదండ్రులు: శానంపూడి అంకిరెడ్డి, సత్యవతి
కుటుంబం : భార్య, ఇద్దరు కుమారులు
పుట్టిన తేదీ: 18-4-1974

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పేరును ఆ పార్టీ ప్రకటించింది. బీజేపీ అధిష్టానం బుధవారం విడుదల చేసిన రెండో విడత ఎంపీ అభ్యర్థుల జాబితాలో నల్లగొండ నుంచి సైదిరెడ్డి పేరు ఉంది. బీఆర్‌ఎస్‌లో ఉన్న సైదిరెడ్డి నాలుగు రోజుల కిందటే బీజేపీలో చేరారు. ఎంపీ టికెట్ హామీతోనే ఆయన్ని బీజేపీలో చేర్చుకొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు దీటైన అభ్యర్థిని నిలబెట్టాలనే ఆలోచనతో బీజేపీ సైదిరెడ్డిని ఎంపిక చేసింది. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి కందూరు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి పేరు ఖరారు కాగా.. బీఆర్‌ఎస్ పార్టీ కూడా బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ అధిష్టానం ఎన్‌ఆర్‌ఐ, వ్యాపార వేత్త, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన శానంపుడి సైదిరెడ్డిని రంగంలోకి దింపింది. మోదీ ప్రభంజనం, సైదిరెడ్డికి ఉన్న బలం తమకు కలిసి వస్తుందన్న ఆలోచనతోనే బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయానికి వచ్చింది.

**ఆశావహులకు నిరాశ**

నల్లగొండ ఎంపీ టికెట్ ఆశించిన పలువురు బీజేపీ నాయకులకు ఈ పరిణామంతో నిరాశ తప్పలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన గార్లపాటి జితేంద్రకుమార్‌తో పాటు బండారు ప్రసాద్, నూకల నర్సింహారెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి, పెరిక సురేష్, బండారు ప్రసాద్ ఈసారి పోటీ చేసేందుకు ఆసక్తి చూపినా అధిష్టానం శానంపూడి సైదిరెడ్డికి అవకాశం కల్పించింది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం బీజేపీ నేతలు పార్టీని బలోపేతం చేయలేకపోయారు. దీంతోనే కొత్త వ్యక్తికి టికెట్ ఇవ్వడం వల్ల పార్టీకి కలిసి వస్తుందనే ఉద్దేశంతో అధిష్టానం సైదిరెడ్డికి టికెట్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

**రెండు చోట్ల బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికే..**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ టికెట్లు బీఆర్‌ఎస్ నుంచి చేరిన నేతలకే దక్కాయి. ఎన్నికలకు ముందే భువనగిరి మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ నేత బూర నర్సయ్యగౌడ్ బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయనకు భువనగిరి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ టికెట్ ఇచ్చింది. తాజాగా నల్లగొండ టికెట్‌ను బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి ఇచ్చింది.

**కెనడా పౌరసత్వం వదులుకొని..**

కెనడా పౌరసత్వం కలిగిన సైదిరెడ్డి అక్కడ అనేక సంవత్సరాలు వ్యాపారం చేశారు. వారిది స్థానికంగా రాజకీయ కుటుంబమే. ఆయన తండ్రి శానంపూడి అంకిరెడ్డి ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకుడు. మఠంపల్లి మండలం గుండ్లపలి సర్పంచిగా, జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యునిగా పనిచేశారు. డిగ్రీ వరకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే చదువుకున్న సైదిరెడ్డి ఆ సయమంలో టీడీపీ విద్యార్థి విభాగంలో, మఠంపల్లి మండల టీడీపీ అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తరువాత కెనడాకు వెళ్లారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ ఉద్యమం పట్ల కెనడాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కెనడా పౌరసత్వాన్ని వదులుకొని స్వదేశానికి తిరిగి వచ్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా హుజూర్‌నగర్ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తరువాత 2019లో జరిగిన ఉప ఎన్నికలో సైదిరెడ్డి అదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు.

### లింగనిర్ధారణ చట్ట విరుద్ధం

తుంగతుర్తి : ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపర మైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం హెచ్చరించారు. బుధవారం తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి మండలం మంచ్యా తండాకు చెందిన ఆర్‌ఎంపీ భూక్య కిషన్ ..గర్భిణులను ఖమ్మంలోని ఆస్పత్రులకు తరలించి అబార్షన్లు చేయిస్తున్నాడని ఆరోపణలు రావడంతో ఆ క్లినిక్ పై దాడులు నిర్వహించామన్నారు. ఆ క్లినిక్‌లో హైక్వాలిఫైడ్ మందులు,ఇంజక్షన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స చేసి పై ఆస్పత్రులకు పంపించాలన్నారు. సమావేశంలో తుంగతుర్తి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మల్‌కుమార్, వైద్యాధికారి లింగమూర్తి, జిల్లా విస్తరణ మాధ్యమ అధికారి అంజయ్య పాల్గొన్నారు.

### ఉత్తమ్, పొంగులేటి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ రాహుల్‌హెగ్డే, ప్రొబేషనరీ ఎస్పీ మీనాతో కలిసి బుధవారం పరిశీలించారు. పట్టణంలోని హెలిపాడ్‌ను, ఫణిగిరి గుట్ట వద్ద రూ 74.80 కోట్లతో 2,160 సింగిల్ బెడ్ రూం ఇళ్ల పనుల పునఃప్రారంభ పైలాన్‌ను, పర్యటన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. సభ ఏర్పాట్లపై స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులతో చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్ రాజానాయక్, యడ్ల విజయ్ పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

# ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- తొలివిడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయింపు
- ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున దశలవారీగా సాయం
- జిల్లాలో సొంతిళ్లు లేని కుటుంబాలు 80 వేలకు పైనే..
- ప్రజాపాలనలో ఇళ్ల కోసం 3.16లక్షల దరఖాస్తులు
- లబ్ధిదారుల ఎంపికకు అధికారుల కసరత్తు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించి మార్గదర్శకాలు విడుదల చేయడంతో గూడు లేని నిరుపేదల ఆశలు చిగురిస్తున్నాయి. స్థలం ఉన్నవారికి నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. ప్రజాపాలనలో సొంతింటి కోసం 3.16 లక్షల దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 14వేల కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**ఇంటి కోసం 3.16 లక్షల దరఖాస్తులు**

జిల్లాలో సుమారు 80 వేల కుటుంబాలకు సొంత ఇళ్లు లేవని ఓ సర్వేలో తేలింది. అయితే ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,16,885 మంది, అమరుల ఇంటి స్థలం కోసం 589 మంది , ఉద్యమకారులకు ఇంటి స్థలం కోసం 3,161 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన మొదటి విడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 14వేల కుటుంబాలకు లబ్ధిచేకూరే అవకాశం ఉంది. ఆహార భద్రత కార్డు ఉన్నవారిని అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల పూర్తి సబ్సిడీని దశల వారీగా అందజేస్తుంది. ఇందులో బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష, పైకప్పు నిర్మాణ సమయంలో రూ.లక్ష, పైకప్పు వేసిన తరువాత రూ.2లక్షలు, ఇల్లు పూర్తయ్యాక రూ.లక్ష అందజేస్తారు.

**పైరవీలు షురూ..**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటి నుంచి పైరవీలు షురూ అయ్యాయి. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూ తమకే లబ్ధి చేకూరేలా విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో ఇళ్ల కేటాయింపుల్లో తమకు అన్యాయం జరిగిందని, ఈ సారి న్యాయం. చేయాలని కోరుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీ నేతల చుట్టూ లబ్ధిదారులు చక్కర్లు కొడుతున్నారు.

**గత దరఖాస్తులు వృథాయేనా..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 ఆగస్టులో సొంతిళ్ల కోసం దరఖాస్తులను కోరింది. సొంతస్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించింది. జిల్లాలో మొత్తం 58,564 దరఖాస్తులు రాగా 34,849 మందిని అర్హులుగా తేల్చారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల యూనిట్ల చొప్పున నాలుగు నియోకవర్గాల్లో 12వేల యూనిట్లకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచి పోయింది.

**5,424 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసినా..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో జిల్లాలో 5,424 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసి వీటిలో సుమారు 1,764 మందికి పట్టాలు పంపిణీ చేసింది. మరో వెయ్యి వరకు పూర్తయిన ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయడంతో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నట్లు ప్రకటించడంతో పేదల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

# ఎన్నికల టీములు సమన్వయంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల టీములు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికలపై బుధవారం కలెక్టరేట్‌లోని అన్ని శాఖల సిబ్బందికి మోడల్‌కోడ్, సీ-విజిల్, సువిధ, మ్యాన్ పవర్ మేనేజ్ మెంట్, ఈవీఎం మేనేజ్ మెంట్ అంశాలపై ఇచ్చిన శిక్షణలో అదనపు కలెక్టర్ బీఎస్. లతతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు అన్ని శాఖల సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఫారం 12-ఈ ద్వారా 85 ఏళ్లున్న వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచే మోడల్ కోడ్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ట్రైనింగ్ అధికారులు రమేష్, శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

**ఎన్నికల శిక్షణకు హాజరుకాని సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం**

ఎన్నికల శిక్షణకు హాజరుకాని కలెక్టరేట్ సిబ్బందిపై కలెక్టర్ వెంకటరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలపై బుధవారం కలెక్టరేట్‌లో ఇచ్చిన శిక్షణకు కొన్ని శాఖల సిబ్బంది హాజరుకాక పోవడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఎన్నికల సమయంలో సెలవు ఇవ్వకూడదని చెప్పినా ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. సమాచారం లేకుండా విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై అత్యవసర సమయంలో తప్ప సెలవు ఇవ్వకూడదని సూచించారు.

## క్లుప్తంగా

### మంటలంటుకొని మూడు గడ్డివాములు దగ్ధం



దగ్ధమైన గడ్డివాములు

హాలియా: అనుముల మండలంలోని వీర్లగడ్డ తండాలో బుధవారం మంటలంటుకొని మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్లగడ్డతండా గ్రామానికి చెందిన రైతులు ఆంగోతు నాగు నాయక్, ఆంగోతు మంగ్యానాయక్, ఆంగోతు భీమానాయక్ తమ వ్యవసాయ పొలంలో మూడు గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వీచిన గాలిదుమారానికి గడ్డివాముల సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు ఒక్కదానికొకటి రాసుకొని మంటలు లేచాయి. ఈ మంటలు సమీపంలోనే ఉన్న గడ్డివాములకు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఫైరింజన్ చేరుకొని మంటలను ఆర్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### బైక్‌ను ఢీకొట్టిన ఆటో

- భర్త మృతి, భార్యకు గాయాలు

నకిరేకల్ : బైక్‌ను ఆటో ఢీకొనడంతో భర్త మృతిచెందగా.. భార్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ మండల పరిధిలోని మర్రూరు గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన పిల్లుట్ల శ్రీను(46) తన భార్య విజయతో కలిసి బైక్‌పై బుధవారం శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్‌లో శుభకార్యానికి హాజరై సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం మర్రూరు గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య విజయకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్ కుమార్ తెలిపారు. మృతుడికి ఒక కూమారుడు ఉన్నాడు.

### చికిత్స పొందుతూ మృతి

పెన్‌పహాడ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన మామిడి నాగయ్య(53), కోల హుస్సేన్ మంగళవారం బైక్‌పై సూర్యాపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. మార్గమధ్యలో పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్ గ్రామ శివారులో రాత్రి సమయంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగయ్యకు తీవ్ర గాయాలు, కోల హుస్సేన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగయ్య మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# అలంకార, వాహన సేవలకు శ్రీకారం

- ఉదయం మత్స్యావతారంలో దర్శనమిచ్చిన యాదాద్రీశుడు
- రాత్రి శేష వాహనంపై విహరించిన ఉత్సవమూర్తులు
- నేడు వటపత్రశాయి అలంకార సేవ, హంస వాహన సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అలంకార, వాహన సేవలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం నిత్యారాధనలు పూర్తయిన తర్వాత ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా స్వామివారిని దక్షిణ ప్రాకారంలోని నిత్య కల్యాణ మండపంలో మత్స్యావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మాడ వీధుల్లో స్వామివారి అలంకార సేవను ఊరేగించారు. అనంతరం తూర్పు మాఢ వీధిలో అలంకార సేవను అధిష్ఠించి ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు స్వామివారిని ఆరాధిస్తూ పారాయణం పఠించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ప్రధానర్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, ఆలయ అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

**సాయంత్రం శేష వాహనంపై..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆచార్యులు నిత్యారాధనలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని శేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. శేష వాహన సేవను తూర్పు మాడ వీధిలో అధిష్ఠింపజేసి వేద మంత్రాలు, పారాయణాలు పఠించారు. ఈ వేడుకలో ఆచార్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. గురువారం ఉదయం స్వామివారికి వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవ నిర్వహిస్తారు.



శేష వాహన సేవను తూర్పు మాడ వీధిలో అధిష్ఠించి పారాయణం పఠిస్తున్న ఆచార్యులు

**రెండు గంటలు ఆలస్యంగా అలంకార సేవ..**

అలంకార సేవను ఆచార్యులు రెండు గంటలు ఆలస్యంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు మత్స్య అలంకార సేవలో స్వామివారు ఊరేగాల్సి ఉండగా.. 11గంటలకు ప్రారంభించారు. గతేడాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా పశ్చిమ రాజగోపురం ముందు గల వేంచేపు మండపంలో అలంకార సేవలను అధిష్ఠించి పూజలు చేశారు. కానీ ప్రస్తుతం తూర్పు రాజగోపురం ముందు గల మాడ వీధిలో అలంకార సేవలను అధిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు. తూర్పు మాడ వీధిలో తాత్కాల్కిక మండపాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియ ఆలస్యం కావడంతో అలంకార సేవ సైతం ఆలస్యంగా నిర్వహించారు.

**ఉచిత వైద్య శిబిరం..**

కొండపైన ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

**యాదాద్రి కొండపై వర్షం..**

యాదాద్రి ఆలయ సన్నిధిలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ మాడ వీధిలో వేసిన రెడ్ మ్యాట్లు వర్షానికి తడిసిముద్దయ్యాయి. సుమారు 5నిమిషాలు వర్షం కురువడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



మత్స్యావతారంలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు, ఆచార్యులు, అధికారులు

### హుండీలకు బట్టలు



ఆలయ ముఖ మండపంలోని క్యూలైన్‌లో హుండీలకు బట్టలు కట్టిన దృశ్యం

ఆలయంలో భక్తులు కానుకలు సమర్పించే హుండీలకు అధికారులు బట్టలు(క్లాత్) కట్టారు. ఆలయ ముఖ మండపంలోని క్యూ లైన్‌లో ఉన్న హుండీలు నిండాయి. దీంతో నిండిన హుండీల్లోని నగదు, కానుకలను సంచుల్లో వేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరచాలి. కానీ.. రెండ్రోజుల క్రితం నిండిన హుండీలను ఖాళీ చేయకుండా అధికారులు ఎర్రటి బట్టలు కట్టారు. హుండీల్లో నగదు, కానుకలు వేయకుండా బట్టలు కట్టడం ఏమిటని అధికారులను భక్తులు ప్రశ్నిస్తున్నారు.

## తహసీల్దార్లకు అధికారం ఇస్తేనే భూసమస్యలు పరిష్కారం

- ధరణి అధ్యయన కమిటీ సభ్యులు

మునుగోడు: భూ సమస్యలు పరిష్కరించాలంటే పూర్తి అధికారాలు తహసీల్దార్లకు ఇవ్వాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ధరణి అధ్యయన కమిటీ సభ్యులు కోదండరెడ్డి, భూమి సునీల్ అన్నారు. బుధవారం వారు నల్లగొండ జిల్లా మునుగోడులో పర్యటించి పలువురు రైతులతో మాట్లాడి భూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లి తహసీల్దార్‌తో పాటు సిబ్బంది, రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్‌తో ఉన్న ధరణి సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అనేక కారణాల వల్ల గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని ఏ విధంగా పరిష్కరించవచ్చో తెలుసుకునేందుకు ప్రతి మండల కేంద్రంలో పర్యటించి అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి పెండింగ్ దరఖాస్తుల్లో సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు న్యాయం వైపు ఉండి.. అన్ని అర్హతలు కలిగిన రైతులకు మాత్రమే భూమి హక్కులు కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, రెవెన్యూ అధికారుల నుంచి ధరణిపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, భూమి సునీల్

## సవాళ్లను అధిగమించేందుకు ప్రయత్నించాలి

నల్లగొండ రూరల్: దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులు తమ వంతు ప్రయత్నం చేయాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) పాలకమండలి మాజీ సభ్యుడు బోయినపల్లి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎంజీయూలో యువ సంవాద్ భారత్–2047 కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి దగ్గర ఏదో ఒక రంగంలో రాణించే విజ్ఞాన సంపద ఉంటుందని.. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు పరిశోధనలు చేయాలన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్నారు. అవినీతి, అనారోగ్యం, నిరక్షరాస్యత, నైపుణ్యలేమి అంశాలను అధిగమించి యువత ప్రధాన భూమిక పోషించాలన్నారు. అధ్యాపకుడు అంజిరెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, స్వీయ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. యువత ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, మద్దిలేటి, సైదులు, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంజీయూ పాలకమండలి మాజీ సభ్యుడు బోయినపల్లి కృష్ణారెడ్డి

## ముగిసిన శివరాత్రి జాతర

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన జాతర మంగళవారం రాత్రి పవళింపు సేవతో ముగిసింది. ఉత్సవమూర్తులను ఊయలపై ఉంచి వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, రాధాకష్ణమూర్తిశర్మ పూజలు నిర్వహించారు. పవళింపు సేవకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరై పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

**హుండీ ఆదాయం లెక్కింపు..**

జాతర ముగియడంతో ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. రూ.38,89,889 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు ప్రకటించారు. గతేడాది కంటే రూ.1,17,831 ఆదాయం తక్కువగా వచ్చింది. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

## యాదాద్రీశుడిని దర్శించుకున్న బంగ్లాదేశ్ స్వామీజీ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని బంగ్లాదేశ్ దేశానికి చెందిన భక్త బిమాన్ స్వామీజీ బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మత్స్య అలంకార సేవలోనూ పాల్గొన్నారు.



స్వామివారి అలంకార సేవలో పాల్గొన్న బంగ్లాదేశ్‌కు చెందిన భక్త బిమాన్ స్వామిజీ

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

మిర్యాలగూడ టౌన్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఏఎస్ఐ ఉమాపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. అవంతీపురం గ్రామానికి చెందిన ఉప్పల శేఖర్ ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కొద్ది సేపటి తర్వాత ఇంటికి వచ్చిన శేఖర్ తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా.. అందులో దాచిన రెండున్నర తులాల బంగారం, రెండు ఉంగరాలు, ఒక చైన్‌తో పాటు కొంత నగదు చోరీగురైనట్లు గుర్తించాడు. బాధితుడు బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



శ్రీను మృతదేహం

నేరేడుచర్ల: మున్సిపాలిటీ శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద బుధవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల పట్టణానికి చెందిన అరూరి శ్రీనివాస్(35) స్థానికంగా టీస్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం నేరేడుచర్ల మున్సిపాలిటీ శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద అతడు మృతిచెంది ఉండటం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న నాగేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

మిర్యాలగూడ: బైక్‌పై వెళ్తున్న మహిళ పోగొట్టుకున్న బ్యాగును పోలీసులు బాధితురాలికి అప్పగించారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్‌కు చెందిన రమావత్ అంబాలి తన భర్త రాజ్యాతో కలిసి బైక్‌పై బుధవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో దామరచర్లకు వస్తున్నాడు. మార్గమధ్యలో అంబాలి చేతిలోని బ్యాగు జారిపడిపోయింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వారు బ్యాగు లేదని గమనించి తిరిగి వెనక్కి వచ్చి వెతికినా బ్యాగు కనిపించలేదు. దీంతో వాడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ రవి తన సిబ్బందితో కలిసి దామరచర్ల –జాన్‌పహాడ్ రహదారిపై రాకపోకలు సాగించే వారి వివరాలు సేకరించగా లారీ డ్రైవర్లు సపావత్ మధు, సపావత్ బోడుకు బ్యాగు దొరికినట్లుగా గుర్తించారు. ఈలోగా మధు, బోడు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి బ్యాగును పోలీసులకు అప్పగించారు. అనంతరం ఎస్ఐ రవి బాధితులకు బ్యాగును అప్పగించారు. బ్యాగులో నాలుగు తులాల బంగారం, రూ.లక్ష నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. పోలీసులు పోయిన బ్యాగును అప్పగించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.



బాధితులకు బ్యాగు అందజేస్తున్న ఎస్ఐ రవి

## ఎర్త్ డ్యాం దిగువన అటవీ ప్రాంతంలో మంటలు



మంటలు ఆర్పుతున్న అటవీ, అగ్నిమాపక సిబ్బంది

నాగార్జునసాగర్: సాగర్ ఎర్త్ డ్యాం దిగువన అటవీ ప్రాంతంలో బుధవారం మంటలు చెలరేగాయి. సకాలంలో స్పందించిన అటవీశాఖ అధికారులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా.. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేసింది. రోడ్డు వెంట చెత్త కాల్చడం వల్ల మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు.

## భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): కట్టుకున్న భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి. దుర్గాప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం హరియాతండాకు చెందిన నేనావత్ తావుర్య రెండో కుమార్తె విజయకు పెద్దవూర మండలం చింతపల్లితండాకు చెందిన జటావత్ శ్రీనుతో 2009లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ధనుష్ ఉన్నాడు. శ్రీను మద్యానికి బానిసై విజయను తరచూ ఇబ్బందులు పెట్టేవాడు. ఎన్నిసార్లు చెప్పినా అతడు మారకపోవడంతో 2021లో కుమారుడితో కలిసి విజయ తన తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తన భార్యను కాపురానికి పంపాలని అనేకసార్లు పెద్ద మనుషుల సమక్షంలో విజయ తల్లిదండ్రులను శ్రీను కోరాడు. మద్యం తాగనని మాట ఇస్తే పంపుతామని విజయ తల్లిదండ్రులు చెప్పారు. కాగా 2021 అక్టోబర్ 30వ తేదీన పెద్దమనుషులతో కలిసి అత్తగారింటికి వచ్చిన శ్రీను తన భార్యను కాపురానికి పంపాలని అడిగగా.. వారు పంపమని చెప్పారు. దీంతో కక్ష పెంచుకున్న శ్రీను మరుసటి రోజు సాయంత్రం వ్యవసాయం పొలం వద్ద ఉన్న విజయపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయ పనులకు వెళ్లిన విజయ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి తావుర్య పొలం వద్దకు వెళ్లి చూసేసరికి రక్తపు మడుగులో విజయ విగతజీవిగా కనిపించింది. దీంతో తావుర్య తన అల్లుడు శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పటి కొండమల్లేపల్లి సీఐ వై. రవీందర్ కేసు నమోదు చేసి శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారణలో భాగంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి. దుర్గాప్రసాద్ శ్రీనుకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. మృతురాలి కుమారుడు ధనుష్‌కు ఆర్థికసాయంతో పాటు గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించాలని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరగా న్యాయమూర్తి సానుకూలంగా స్పందించి తీర్పు కాపీని ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపిస్తూ వారికి చట్టపరంగా అందాల్సిన సహాయ సహకారాలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జగన్ సహకరించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మోతె: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మోతె మండలంలోని హుస్సేనాబాద్ గ్రామ పరిధిలో సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలంలోని గోల్‌తండాకు చెందిన భూక్య బాలాజీ(30) తన బైక్‌పై సూర్యాపేట వైపు వెళ్తుండగా హుస్సేనాబాద్ గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బైక్‌లో దొరికిన ఆధారాలతో భూక్య బాలాజీగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

## బాల్య వివాహం అడ్డగింత

కొండమల్లేపల్లి: మండలంలోని దోనియాలలో 16ఏళ్ల బాలికకు వివాహం చేయటానికి బాలిక తల్లి, బంధువులు ప్రయత్నించగా బుధవారం ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ బాలిక బంధువులకు వివరించారు. 18 ఏళ్ల తర్వాతే వివాహం చేస్తామని బాలిక తల్లిదండ్రుల నుంచి లెటర్ తీసుకున్నారు. తహసీల్దార్ దివ్యారెడ్డి, ఎస్ఐ రాంమూర్తి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ తదితరులున్నారు.

## బసవేశ్వరాలయంలో చోరీ

- హుండీలోని నగదు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం లావూడితండాలోని లింగ బసవేశ్వరాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీని తీసుకెళ్లి గ్రామ సమీపంలో పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఆలయంలో గల సీసీ కెమెరాలతో పాటు వాటి బాక్స్‌ను కూడా ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. అయితే గ్రామం నుంచి ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



గ్రామ సమీపంలో హుండీ పడేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

## రేవంత్‌రెడ్డిని దింపాలని కాంగ్రెస్ వాళ్లే అనుకుంటున్నారు

- ఎక్కడ చూసినా మోదీ గాలి వీస్తోంది
- బీఆర్ఎస్ పని అయిపోయింది
- వైరల్‌గా మారిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆడియో

హుజూర్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని పదవి నుంచి దింపాలని కాంగ్రెస్ వాళ్లే అనుకుంటున్నారని హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడిన ఆడియో వాట్సప్ గ్రూపులలో చక్కర్లు కొడుతోంది. సైదిరెడ్డి బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన తర్వాత విడుదల చేసిన వాయిస్ రికార్డ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ ఆడియోలో ఆయన ఇంకా ఏమన్నారంటే... 'బీజేపీ నాయకులు ఫోన్ చేసి అర్జంటుగా రమన్నారంటే నేను ఢిల్లీకి వెళ్లి పోయిన. మీరే పోటీ చేయాలి, ప్రధాని, అమిత్‌షా సమక్షంలో నీ పేరు ప్రకటిస్తామని చెప్పారు. దీని కోసం నీవు పార్టీలో జాయిన్ కావాలి. నీవు కండువా వేసుకోకపోతే, నీవు వెనక్కిపోతే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పరువుపోతుందని అన్నారు. అయితే మా వాళ్లతో మాట్లాడుకుని వస్తానని చెప్పినా వారు వినలేదు. అప్పుడు అక్కడ వెంకట్రావు, సీతారాంనాయక్ ఉన్నారు. లేదు.. లేదు.. మళ్లీ మీటింగ్ జరగదు, ఈ మీటింగ్‌లో మీ పేరు ప్రకటిస్తామని చెప్పారు. మీకు తెలుసు.. బీజేపీ ఇప్పుడు ఉందా లేదా అని. నేను వచ్చిన రోజు టీఆర్ఎస్ పరిస్థితి ఏందో కూడా మీకు తెలుసు. ఒక్క సర్పంచ్ కూడా లేదు మన హుజూర్‌నగర్‌లో. కానీ నేను వచ్చిన తర్వాత 120 సర్పంచ్‌లు, 17 పీఏసీఎస్‌లు గెలిపించుకున్నం. ఎంపీపీలు, జడ్పీటీసీలు గెలిచినం. కానీ కొంత యూత్‌కు ఏమీ చేయలేక పోయాం. ఇప్పుడు కేంద్రం సాయం తోటి యువతకు సాయం చేస్తాం. కేంద్రంలో ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ మోడీ వస్తాడు. హైవేలు గానీ ఇంకా ఏదైనా ఆయన సపోర్టు ఉంటే మనకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతోనే ఇదంతా చేశాను. వారు (బీజేపీ) కూడా మనలను కావాలని అనుకున్నారు. మనకన్నా చాలా మంది ట్రై చేసేవారు ఉన్నారు. ఈ రోజు బీఆర్ఎస్ నుంచి చాలా మంది వెళ్లిపోతున్నారు. బీఆర్ఎస్‌లో పోటీ అంటేనే నేతలు భయపడి పోతున్నారు. రంజిత్ రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి కూడా పోటీచేడయం లేదు. రేపు సీఎం రేవంత్‌రెడ్డిని దింపాలని అది చేయాల, ఇది చేయాలని కొంత మంది కాంగ్రెస్ నాయకులే అనుకుంటున్నారు. వాళ్లకు మనోళ్లే సపోర్టు చేయవచ్చు. దీంతో లాస్టుకు ఎలక్షన్‌కు పోయేసరికల్లా మనమే ఆగం కావచ్చు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, మీరందరూ నా వెంట ఉంటారనుకుని దాంట్లోకి (బీజేపీలోకి) పోయిన. కొంతమంది ముస్లింలకు బీజేపీ అంటే పడదు, సైదన్న ఇలా చేస్తడా అని అనుకుంటా ఉన్నారు. కానీ మీకు తెలుసు నేను దర్గాకు పోయినా ఎక్కడకు పోయినా మనమంతా లోకల్ అని పనిచేసిన. అది పార్టీనా, మతమా, కులమా అని పనిచేయలే. ఒక వేళ మీకు నేను చెప్పకపోవడం తప్పే ఆ తప్పును క్షమించండి. ఎలక్షన్‌లలో డబ్బులు మీకు ఇస్తామని లాస్టుకు మేం ఇయ్యలేము మీరే పెట్టకోండి అని ఎవరైనా చెబితే మీరు వింటరా, డబ్బులు మనకు ఇయ్యకుండా అవతల వారికి ఇస్తే మనం పార్టీలో ఎలా పనిచేస్తాం. ఒకసారి సైదన్న చేసింది తప్పా రైటా అని ఆలోచించండి. రేపు పార్టీ పరిస్థితి ఎట్లుంటదో ఆలోచించండి. ఇవాళ మనం అంత చెబుతున్నా టీడీపీ కనుమరుగైపోయింది. అప్పుడు ఏమీలేని బీఆర్ఎస్ పైకి వచ్చింది. రేపు బీజేపీకి 10 నుంచి 12 ఎంపీ సీట్లు వచ్చే అవకాశం ఉంది. మీరు ఉంటరనే నేను సెట్ చేసుకున్న. మీరు లేకుండా నేను ఒక్కడిని పోయినా ఆడ విలువ ఉండదు. మీరందరూ కచ్చితంగా నా వెంట రావాల, నా వెంటే వస్తారని ఆశిస్తున్నా... జై తెలంగాణ' అంటూ ముగించారు.